నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్, గురువారం 3 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

## అడ్రస్ అడిగి..
# గొలుసు లాక్కెళ్లి..



సీసీ పుటేజీలో రికార్డయిన దుండగులు

భైంసా, అక్టోబర్ 2 : పట్టణంలోని రాహుల్‌నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. పులేనగర్‌కు చెందిన గంగాదేవి బుధవారం రాహుల్‌నగర్ ప్రధాన రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్తున్నది. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అడ్రస్ అడుగుతూ.. ఒక్కసారిగా ఆమె మెడలో నుంచి ఐదు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో ఆమె ప్రతిఘటించగా చేతికి గాయాలయ్యాయి. దుండగులు పారిపోతున్న దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ మేరకు బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# తాగునీరు అందించేందుకు చర్యలు

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**




నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

తలమడుగు, అక్టోబర్ 2 : పాల్సి(బీ) ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యపై ఈనెల 1వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'గిరిజనులకు క'న్నీటి' కష్టాలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండలంలోని పల్సి(బీ), పల్సి(కే)తో పాటు వివిధ గ్రామాలను అధికారులు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయో? లేదో? అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ డీఈ దేవయ్య, ఏఈ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, సచిన్ పాల్గొన్నారు.

# రైతు కంట కన్నీరు

**ముగిసిన వానకాలం సీజన్**

- మొదలు కానున్న యాసంగి పనులు
- నేటికీ అందని పెట్టుబడి సాయం
- నిర్మల్ జిల్లా రైతులపై రూ.228 కోట్ల భారం
- అప్పలతో సతమతమతం.. మళ్లీ పెట్టుబడికి తిప్పలు..
- రుణమాఫీ వర్తించక ఆవేదన చెందుతున్న అన్నదాత



నిర్మల్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ) : ఈసారి వానకాలం నుంచే అన్నదాతను ఒక్కో సమస్య వరుసబెట్టి వెంటాడుతున్నాయి. ఓ వైపు సర్కారు సాయం చేయకపోవడం, మరో వైపు ప్రకృతి తోడ్పాటును అందించకపోవడంతో ఈసారి వానకాలం సీజన్ అంతా రైతుకంట కన్నీరే నింపింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం మంగళవారం నాటితోనే ఖరీఫ్ సీజన్ ముగియగా, బుధవారం నుంచి యాసంగి సీజన్ మొదలవుతుందని వ్యవసాయ శాఖ తన ప్రణాళికలో పేర్కొన్నది. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం సహకారం అందించకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా చాలా చోట్ల పంటలు నష్టపోవడం, ఇసుక మేటలు వేయడంతో చేతికొచ్చిన పంటలన్నీ నీటిపాలయ్యాయి. వానకాలం సీజన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని అందించకపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనికి తోడు రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో అందక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో జిల్లా రైతులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. అలాగే వానకాలం సీజన్‌కు సంబంధించి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న అన్నదాత.. పూర్తిగా కోలుకోక ముందే మళ్లీ యాసంగి సీజన్ ప్రారంభం కానుండడంతో ఎలా ముందుకు సాగాలో అర్థం కాని పరిస్థితి నెలకున్నది. గత వానకాలం సాగుకు చేసిన అప్పులే తీర్చలేక సతమతమవుతున్న అన్నదాతకు ప్రస్తుతం మొదలు కాబోయే యాసంగికి అవసరమయ్యే పెట్టుబడిని ఎక్కడి నుంచి తేవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గత వానకాలం, ప్రస్తుత యాసంగి సాగుకు అవసరమయ్యే పెట్టుబడి సాయాన్ని అందించాలని కోరుతున్నారు. రుణమాఫీని వర్తింపజేసి, కొత్త పంట రుణాలను మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వానకాలం మాదిరిగానే యాసంగిపై నిర్లక్ష్యం వహిస్తే తిరుగుబాటు తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రైతులపై అప్పుల భారం

వానకాలానికి సంబంధించి పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులపై అప్పుల భారం పెరిగిందంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం యేడాదికి రెండు పంటలకు కలిపి ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసేది. సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందడంతో రైతులు సంతోషంగా వ్యవసాయ పనులు చేసుకునేవారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు స్థానంలో రైతు భరోసాను తీసుకొచ్చి ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. గత యాసంగిలో అరకొర సాయాన్ని అందించిన ప్రభుత్వం.. వానకాలంలో నయా పైసా ఇవ్వకుండా మోసం చేసింది. దీంతో జిల్లా రైతుల అప్పులు పేరుకు పోయాయంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,88,317 మంది రైతులకు రూ.228 కోట్ల పెట్టుబడి సాయం అందింది. అంటే కాంగ్రెస్ సర్కారు పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం వల్ల ఈ వానకాలంలో జిల్లా రైతులపై రూ.228 కోట్ల భారం పడినట్లేనని చెబుతున్నారు.

### రుణమాఫీ కోసం ఎదురుచూపు

జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా తామేం పాపం చేశామంటూ సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అనేక ఆంక్షలు పెట్టడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 81,186 మంది రైతులు పంట రుణాలు తీసుకోగా, ఇప్పటివరకు 64,742 మందికి రుణమాఫీ జరిగినట్లు చెబుతున్నారు. ఇంకా 16,444 మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉన్నది. ఇప్పటి వరకు జిల్లాలో 79 శాతం మంది రైతులకే రుణమాఫీ కాగా, మిగతా రైతులు రుణమాఫీ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మిగిలిన రైతులకు సంబంధించి ఇంకా రూ.350 కోట్ల వరకు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు రుణమాఫీ కాకపోవడం, మరోవైపు రుణాలు రీ షెడ్యూల్ కాక జిల్లాలోని అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది.



ఇంద్రవెల్లి మండలంలో సాగవుతున్న పత్తి, సోయ

# ఆశాజనకం

**ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఏపుగా పెరిగిన పంటలు**

- సాధారణ వర్షపాతం నమోదు.. అందని రైతు భరోసా
- కొనుగోళ్లపై ఆశలు

ఆదిలాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది వానకాలం సాగు ఆశాజనకంగా ఉంది. ఈ సీజన్‌లో 5.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. వీటిలో అధికంగా పత్తి 3.97 లక్షల ఎకరాలు, సోయా 71 వేలు, కంది 60 వేల ఎకరాల్లో సాగు చేశారు. సీజన్ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు వాతావరణం, వర్షాలు అనుకూలించడంతో పంటలు ఏపుగా పెరిగాయి. జిల్లాలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 1,005 మిల్లీ మీటర్లు కాగా 1,073 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సోయా కోతలు ప్రారంభం కాగా, రైతులు పత్తిని వారం, పది రోజుల్లో తీయడం ప్రారంభిస్తారు. కాగా.. ఈ సీజన్‌లో వర్షాల వల్ల కొంతమేర పంటలకు నష్టం వాటిల్లింది. ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షాలతో నదీ పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగాయి. జిల్లా వ్యాప్తంగా 3,100 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

### అందని రైతు భరోసా

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు పథకంలో భాగంగా రైతులకు ఏటా రెండు సీజన్‌లలో సాగుకు పెట్టుబడులు అందేవి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ముందుగానే ఎకరాకు రూ.10 వేలను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతులు తమకు నచ్చిన కంపెనీల విత్తనాలతోపాటు ఎరువులను కొనుగోలు చేసుకునే వారు. రైతు బంధు పథకం వల్ల జిల్లా రైతులకు దళారుల వద్ద నుంచి అప్పులు తీసుకొచ్చే బాధలు తప్పాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా మంత్రుల సబ్ కమిటీ జిల్లాలో పర్యటించి రైతుల వద్ద నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టింది. అభిప్రాయ సేకరణ జరిగి మూడు నెలలు కావస్తున్నా రైతు భరోసాకు అతీగతీ లేదు. దీంతో రైతులు సాగు కోసం అప్పులు చేయాల్సి వచ్చింది.

### కొనుగోళ్లపై ఆశలు

ఇప్పటికే సోయా కోతలు ప్రారంభం కాగా, మరో పది రోజుల్లో పత్తి పంటను తీస్తారు. దిగుబడులు బాగా వచ్చే అవకాశాలున్నాయి. పత్తి ఎకరాకు 8 క్వింటాళ్లు, సోయా 7 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు పత్తికి రూ.7,521, సోయాకు రూ.4,892 ప్రకటించింది. మార్క్‌ఫెడ్ ద్వారా సోయా కొనుగోళ్లు జరుపాలని అధికారులు నిర్ణయించారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా నేడు వివిధ శాఖల అధికారులతో సమావేశం జరగనుంది.

### పంటల మీద ఆశ ఉన్నది..



*భీంపూర్ శివారులో నాకు పదెకరాల భూమి ఉంది. మరో ఐదెకరాల కౌలుకు తీసుకున్నా. పత్తి, కంది సాగు చేస్తున్నా. వాతావరణం, వర్షాలు సాగుకు సహకరించడంతో పంటలు ఆశాజన కంగా ఉన్నాయి. పత్తి పంటలో తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. పది రోజుల తర్వాత పత్తి పంట తీస్తా. రైతు భరోసా లేకపోవడంతో సాగు కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. కొనుగోళ్లకు రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.*

**- సంతోష్, రైతు, భీంపూర్**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

# గాంధీజీ బోధనలు స్ఫూర్తిదాయకం

- ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు
- గాంధీ జయంతి వేడుకలకు ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్ హాజరు

ఎదులాపురం, అక్టోబర్ 2 : మహాత్మాగాంధీ బోధనలు ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజర్షి షాలు కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ గొప్ప నాయకుడని కొనియాడారు. ఖైదీలు సత్ప్రవర్తన దిశలో నడిచే విధంగా ప్రణాళికలు అమలవుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ప్రతి బుధవారం జైలులో ఒత్తిడికి గురైన ఖైదీల కొరకు మానసిక వైద్యుడితో కౌన్సెలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భోవనగిరి సౌజన్య, అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో కృష్ణ, జైల్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, జైల్ మెడికల్ ఆఫీసర్ అరిమా, జైలర్లు సూర్యప్రకాశ్ రెడ్డి, డిప్యూటీ జైలర్లు ప్రకాశ్, కృష్ణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, జైల్‌నాన్ అఫీషియల్ మెంబర్ సుధీర్‌కుమార్ ఉన్నారు.


### అహింసా మార్గంతోనే స్వాతంత్ర్యం సిద్ధించింది

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

మహాత్మా గాంధీ అహింసా మార్గంతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గాంధీ 155వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గాంధీని ఆదర్శంగా తీసుకుని సత్యం, అహింసా మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి తిరుమల, కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి పాల్గొన్నారు.

# రెండో రోజు కౌన్సెలింగ్

**27 మంది అభ్యర్థుల హాజరు**



కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ జైసింగ్

ఎదులాపురం, అక్టోబర్ 2 : ఆదిలాబాద్ రిమ్స్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు రెండో రోజైన బుధవారం కొనసాగాయి. మొదటి రోజు 24 మంది కళాశాలలో అడ్మిషన్లు తీసుకోగా.. రెండో రోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 27 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది అభ్యర్థుల పత్రాలను పరిశీలించారు. రేపు చివరి రోజు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటారని సిబ్బంది తెలిపారు. కౌన్సెలింగ్‌లో రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అక్షయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రదీప్, నోడల్ అధికారి ప్రశాంత్‌రెడ్డి, ట్యూటర్లు జస్సికా, ఇర్ఫాన్, సిబ్బంది రాకేశ్, గణేశ్, ఆశన్నలు పాల్గొన్నారు.

# సమ్మె సైరన్

- వేతనాలు చెల్లించాలని విధుల బహిష్కరణ
- రెండు రోజులుగా మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె
- వేతనాలు చెల్లిస్తేనే విధులు నిర్వహిస్తాం..
- కంపుకొడుతున్న కాలనీలు



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 2 : నిర్మల్ మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులు వేతనాలు ఇవ్వాలని సమ్మెబాట పట్టారు. ఆగస్టు 26 వ తేదీ నుంచి విధులు బహిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సమ్మెలోకి దిగారు. దాదాపు ఐదు రోజులు సమ్మె చేయడంతో జూన్ వేతనాలు విడుదల చేసి, ప్రతి నెల జీతాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విధుల్లోకి చేరారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో మళ్లీ సమ్మె బాట పట్టారు. రెండు రోజుల క్రితం నుంచి విధులను బహిష్కరించి, రోజు తమ నిరసన వ్యక్తం చేస్తూ వేతనాల కోసం పోరాడుతున్నారు.

### వ్యాధుల కాలం.. ఆపై సమ్మె..

నిర్మల్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేయడంతో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయింది. కాలనీలలో డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో రోడ్లపై మురికినీరు పారి దుర్గంధం వెదజల్లుతున్నది. ఇండ్ల నుంచి రోజు తడి-పొడి చెత్తను సేకరించకపోవడంతో ఇండ్లలోనే చెత్త పేరుకుపోయి కాలనీతోపాటు ఇంటి పరిసరాలు కంపుకొడుతున్నాయి. పారిశుధ్య కార్మికులు సమ్మె చేయడంతో సాధారణ వ్యాధులతోపాటు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కాగా.. నిర్మల్ మున్సిపాల్టీలోని పారిశుధ్య కార్మికులతోపాటు వాటర్ సప్లై, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఇతర కాంట్రాక్టు కార్మికులు పోరుబాట పట్టారు. దాదాపు 340 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు సుమారు రూ.40 లక్షల వేతనాలు అందాలి. మూడు నెలలకు కలిపి రూ.1.20 కోటి వేతనాలు చెల్లించాల్సి ఉంది.

### అద్దె చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నాం..



*నేను మున్సిపల్ నీటి సరఫరా విభాగంలో విధులు నిర్వహిస్తున్నా. అద్దె ఇంట్లో జీవనం గడుపుతున్నా. మున్సిపల్ అధికారులు సకాలంలో వేతనాలు అందించకపోవడంతో నాలుగు నెలలుగా అద్దె చెల్లిస్తలేను. దీంతో ఇంటి యజమానితో ఇబ్బందులు పడుతున్నా. సకాలంలో వేతనాలు విడుదల చేసి మా ఆర్థిక ఇబ్బందులు తీర్చాలి.*

**- అల్లె సంతోష్, వాటర్ సప్లయ్ కార్మికుడు.**

### పూటగడవడం కష్టంగా ఉంది..



*నెలనెల జీతాలు సకాలంలో ఇస్తేనే ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయి. ఏకంగా నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం తో అప్పులు చేసి ఇళ్లు గడుపుతున్నా. జీతాలు ఇవ్వకపోవడంతో పిల్లలకు ఫీజులు చెల్లించక ఇబ్బందులు పడుతున్నాం. ఐదు రోజులుగా పని బంద్ చేసినా కూడా జీతాలు ఇచ్చేందుకు ముందుకు వస్తలేరు.*

**- నర్సవ్వ, పారిశుధ్య కార్మికురాలు.**



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# డిజిటల్ కార్డుల సర్వేను నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 2 : డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజిటల్ కార్డుల సర్వేపై అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి నుంచి చేపట్టనున్న డిజిటల్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ డిజిటల్ నంబర్ కేటాయించడంతోపాటు కుటుంబానికి కలిపి ఒక నంబర్ ఇస్తారు. డిజిటల్ సర్వేను మొదలు పెట్టి ఐదు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం, ఒక వార్డును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగ్ రావు, డీపీవో శ్రీనివాస్, ఈడీఎం నదీం పాల్గొన్నారు.

# హైడ్రా పేరిట ఆందోళనకు గురి చేస్తున్నారు

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఎదులాపురం, అక్టోబర్ 2 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా పేరిట పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆందోళనకు గురి చేస్తున్నదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం ఖానాపూర్ చెరువు కట్ట సమీపంలోని ప్రజలను కలిసి వారి బాధలు విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వమే ఇండ్లను నిర్మించుకోవాలని చెప్పిందని, ఇప్పుడు మళ్లీ అదే ప్రభుత్వం కూలగొట్టాలని చూస్తున్నదని ఆరోపించారు. గరీబోళ్లకు ఇల్లు కట్టి వాళ్లే కానీ.. కట్టుకున్న ఇండ్లను కూల్చేయడం సరైన పద్ధతి కాదు. ఆయన వెంట లాలామున్న, ఆకుల ప్రవీణ్, భీంసేన్‌రెడ్డి, కృష్ణ, రాజేశ్, సతీశ్, విజయ్ ఉన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు రెడీ

- ముస్తాబైన బాసర సరస్వతీ ఆలయం
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు



విద్యుద్దీపాలతో ముస్తాబైన బాసర అమ్మవారి ఆలయం

బాసర, అక్టోబర్ 2 : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఏటా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లు, తాగునీరు, ప్రసాద వితరణ సౌకర్యాలు కల్పించనున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వైద్య, పోలీసు, ఆలయ అధికారులు సేవలందిస్తారు. గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయంలో భక్తిపరమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### ముస్తాబైన ఆలయం

సరస్వతీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ గోపురాలకు ప్రత్యేక పూలతో అలంకరించారు. రాత్రివేళలో ఆలయం విద్యుత్ కాంతుల మధ్య మెరిసి పోతుంది. ఆలయంతోపాటు వ్యాసమహర్షి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. కాగా.. గురువారం వేకువ జామున సరస్వతీ అమ్మవారిని అభిషేకం చేస్తారు. మంగళహారతులు అందించి మంత్రపుష్పాలతో పూజకు శ్రీకారం చుడతారు. కాగా.. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శైలిపుత్రికగా దర్శనం ఇవ్వనున్నారు. ఈ రోజు అమ్మవారికి ప్రీతిపాత్రంగా కట్టె పొంగలి నైవేద్యాన్ని అర్చకులు సమర్పించనున్నారు.

### అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్నట్లు నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే రామారావు పటేల్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు అందజేశా రు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏ ర్పాట్లు చేయాలన్నారు. ఈయన వెంట ఈవో విజయరామారావు, ఆలయాధికారులున్నారు.